

## ఘనంగా అన్నపూజ

వరంగల్ నగరంలోని 29వ డివిజన్ పాపయ్యపేటలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం శివ పంచాయాతన క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10.30 గంటలకు స్వామివారికి అన్న పూజా కార్యక్రమాన్ని ఆలయ పూజారి కక్కిరెని కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శ్రీరాముల సురేష్, పుప్పాల ధర్మ, ఎలుకుర్తి ఆనంద్ మోహన్, సారయ్య, రాచర్ల కుమార్, కోరుపోజు లక్ష్మణ్, కమలాకర్, ఆలయ సిబ్బంది నవీన్, ప్రశాంత్ తదితరులు భక్తులు పాల్గొన్నారు.

**- వరంగల్ వాయిస్, కాశిబుగ్గ**


# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 224 శనివారం | 09 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


# ఇక ఆగం కాంగ్రెస్‌లోకి ‘నూకల’






## ఈ నెల 17న ముహూర్తం ఫిక్స్

**తెరుచుకున్న కాంగ్రెస్ డోర్లు**

**ఒక్కొక్కరుగా కారు దిగుతున్న నాయకులు**

**బీఆర్ఎస్ కు బైబై..చేతికి హాయ్..హాయ్..**

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ డోర్నకల్ నియోజకవర్గ రాజకీయం కొత్త పుంతలు తొక్కుతోంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఆధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఒక్కరొక్కరుగా కారు దిగి చేయిపట్టుకునేందుకు క్యూ కడుతున్నారు. అయితే ఇంతకాలం మూసుకొని ఉన్న కాంగ్రెస్ డోర్లు తెరుచుకోవడంతో ఇక మేము ఆగలేమంటూ ముహూర్తం ఫిక్స్ చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నూకల నరేష్ రెడ్డి (ఎన్ఎన్ఆర్) ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, సొసైటీ డైరెక్టర్లు, చైర్మన్లతో పాటు మాజీ ఆధ్యక్షులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌కు బై బై చెప్పి చేతికి హాయ్ చెప్పేందుకు ఈ నెల 17న ముహూర్తం ఫిక్స్ చేశారు. ఆదివారం భారీ సంఖ్యలో కారు దిగుతున్న నేపథ్యంలో ఆ పార్టీ ఇక్కడ ఆగమయ్యే పరిస్థితి నెలకొందన్న ప్రచారం సాగుతోంది.

**- వరంగల్ వాయిస్, డోర్నకల్**

వివరాలు 2లో..

## కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

స్థానిక రాజకీయాలపై చర్చ | పాల్గొన్న కార్పొరేటర్లు



2లో



8లో..

## వాటా కోసం..

బీసీ మహా పాదయాత్ర | వంద కిలోమీటర్లు పూర్తి

హైదరాబాద్ చేరిన బృందానికి ఘన సన్మానం

## జాతీయ ఉత్తమ స్టడీ సెంటర్‌గా.. మౌలానా వర్సిటీ



8లో

# ఇక ఆగం
# కాంగ్రెస్‌లోకి 'నూకల'



**ఈ నెల 17న ముహూర్తం ఫిక్స్**

**తెరుచుకున్న కాంగ్రెస్ డోర్లు**

**ఒక్కొక్కరుగా కారు దిగుతున్న నాయకులు**

**బీఆర్ఎస్‌కు బైబై.. చేతికి హాయ్.. హాయ్**

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఒక వైపు ఎండలు ముదురుతుండగా అదే స్థాయిలో డోర్నకల్ అసెంబ్లీ రాజకీయాలు కూడా వేడెక్కుతున్నాయి. రోజు రోజుకు రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అనేకమంది నాయకులు 'చేయి'పట్టుకొని బీఆర్ఎస్ కు బై బై చెప్పేందుకు సిద్ధపడుతున్నారు. అందుకు కావాల్సిన ముహూర్తం ఫిక్స్ చేసుకుంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో వరస భేటీలు నిర్వహిస్తున్నారు. ఇంకా మేము ఆగలేమంటూ చెప్పుకొస్తున్నారు. ఇదిలా ఉండగా నాయకుల చేరికలపై కొందరూ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ వద్ద శనివారం ప్రస్తావించారు. ఈ చేరికలతో ఇంతకాలం పార్టీలో కష్టపడి పనిచేసిన..చేస్తున్న తమలాంటి వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందంటూ ఆయనకు సూచించారు. అయితే పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఈ చేరికలను స్వాగతించాలని రాంచంద్రు నాయక్ కార్యకర్తలకు సూచించినట్లు వైరల్ అవుతోంది.

### కాంగ్రెస్‌లోకి నూకల..

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నూకల నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మార్పులు జరిగేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఈ మేరకు నియోజకవర్గంలో ఊహగానాలు గుప్పుమంటున్నాయి. నూకల నరేష్ రెడ్డి మేనమామ రాజకీయ పురందరుడు ఆర్ఎస్ సురేందర్ రెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. కాగా డోర్నకల్ నియోజకవర్గంలో పాత టీడీపీ ఇంక బతికే ఉందని, అది రంగు మార్చుకొని కాంగ్రెస్ అభ్యర్థి రాంచంద్రు నాయక్ గెలుపునకు అత్యంత గోప్యంగా పని చేసిందని రాజకీయ విశ్లేషకులు భవిస్తున్నారు.


### మామిడి తోటలో చిట్ చాట్..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాజకీయలు క్రమక్రమంగా మారుతూ వచ్చాయి. కొందరు బీఆర్ఎస్ నాయకులు కారు దిగేందుకు సిద్ధమయ్యారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు ఇతర నేతలతో టచ్ లో ఉంటూ అవకాశంకోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పురోషోత్తమాయిగూడెంలోని మామిడి తోటలో డోర్నకల్ నియోజకవర్గ రెడ్డి నాయకులు ఏర్పాటు చేసుకున్న సమావేశం ఈ ఊతానికి బలం చేకుర్చుతోంది. ఈ సమావేశంలో రెడ్డి సామాజిక వర్గం నేతలతోపాటు పలువురు సీనియర్ బీఆర్ ఎస్ నాయకులు కూడా పాల్గొన్నట్లు ప్రచారం సాగుతోంది.

### ముహూర్తం ఫిక్స్..

రెండు మూడు రోజుల్లో ఓ విందు పార్టీ ఏర్పాటు చేసి తన నిర్ణయాన్ని ప్రజల ముందు ఉంచేందుకు నూకల నరేష్ రెడ్డి సిద్ధపడుతున్నారు. ఈ నెల 15 లేదా 17వ తేదీన హైదారాబాద్ లోని గాంధీ భవన్ లో పెద్ద ఎత్తున ఈ చేరికలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నర్సింహులపేట సీనియర్ నాయకులు టేకుల యాదగిరి రెడ్డి, మరిపెడ నుంచి కొంపెల్లి శ్రీనివాస్, కురవి నుంచి బండి వెంకట్ రెడ్డి, నూకల వేణుగోపాల్ రెడ్డి, సురేందర్ జైన్ తో పాటు మరో ముగ్గురు ముఖ్య నాయకులు ఈ చేరికల లిస్ట్ లో ఉన్నారని పుకార్లు వినిపిస్తున్నాయి. ఎంపీ ఎన్నికలకు ముందు జరగుతున్న ఈ పరినామంతో రాజకీయ దుమారం లేసే అవకాశం మెండుగా ఉంది. ఈ పరినామాలతో లోక్ సభ ఎన్నికల్లో కారు షెడ్డుకు చేరడం ఖాయంగా భావిస్తున్నారు.





## కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

**స్థానిక రాజకీయాలపై చర్చపాల్గొన్న కార్పొరేటర్లు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ను వరంగల్ తూర్పు మాజీ శాసన సభ్యులు నన్నపునేని నరేందర్ శనివారం హైదరాబాద్ లో మర్యాదక పూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మహా నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రిజ్వానా శమిమ్ మాసూద్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, పల్లం పద్మరవి, సిద్ధం రాజు, గందె కల్పనవీన్, బోగి సువర్ణ సురేష్ పాల్గొన్నారు.

## కనుమరుగవుతున్న పద్య నాటక కళను ఆదుకోవాలి



**డాక్టర్ మార్త రమేష్**



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** కనుమరుగవుతున్న పద్య నాటక కళను ఆదుకోవాలి నిమ్స్ అనుసంధాన కర్త డాక్టర్ మార్త రమేష్ కోరారు. గీసుగొండ మండలం ఎలుకుర్తి హవేలీ శ్రీ గంగ భవాని బైద్య నాదేశ్వరాలయంలో శివరాత్రి జాగరణ సందర్భంగా స్థానిక కళాకారులతో శివ పార్వతుల కల్యాణం పద్య నాటకాన్ని ప్రదర్శించారు. డాక్టర్ మార్త రమేష్ ఆర్థిక సహకారంతో నాయకోటి బాబురావు దర్శకత్వంలో రూపొందించిన ఈ ప్రదర్శనలో స్థానిక కళాకారులు గట్ల భిక్షపతి,చొక్కం శ్రీనివాస్, ముత్యాల నారాయణ రెడ్డి, పొడిషెట్టి ప్రకాశ్, సౌరపు రాకేష్, బూర సందీప్, చొక్కం వేణు, రాయరాకుల శ్రవణ్, పొడల నర్సయ్య, నాయకోటి మోహన్ రావు, కర్రె శంకరయ్య, పొడాల విజయ్ కుమార్, శ్రీనివాస్, గంగాధర వెంకటేశ్వర్లు, బొల్లం మల్లేష్ నటించారు. గీసుగొండ ఎంపీపీ సౌజన్య రాంచందర్, ఆలయ చైర్మన్ రక్కిరెడ్ మోహన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.




## ఇసుక మాఫియాపై ఉక్కుపాదం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలో ఇసుక మాఫియాపై పోలీసుల అధికారులు ఉక్కుపాదం మోపారు. సబ్ ఇన్స్పెక్టర్ కనుకుల క్రాంతి కుమార్ శనివారం పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొంతమంది మైనింగ్, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా ఆకేరు వాగు నుంచిఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే విషయంపై రెవెన్యూ, మైనింగ్, భూగర్భ శాఖ అధికారులతో, కలిసి సంయుక్తంగా ఇసుక మాఫియాకు పాల్పడే వ్యక్తులపై, కట్టుదిట్టమైన నిఘా ఉంచి, ఇసుక ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక మాఫియా ఆగడాలకు చెక్ పెట్టేందుకు విధి విధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఇసుక తరలించేవారు ఎంతటి స్థాయి వారైనా శిక్షకు అర్హులవుతారని, స్థానిక పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సై క్రాంతి కుమార్ పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇలాంటి అక్రమాలకు పాల్పడే వ్యక్తులు వెంటనే, మీ అక్రమ చర్యలను ఆపకుంటే, కటకటాల పాలవ్వడం తప్పదని హెచ్చరించారు.

## రేపు బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం




**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుకాల పద్మశాలి భవన్‌లో రేపు ఆదివారం బీఆర్ఎస్ పార్టీ పరకాల పట్టణ స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ ముఖ్య నాయకుల సమావేశానికి పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కాబట్టి, ఈ ముఖ్య నాయకుల సమావేశానికి వార్డులోని ముఖ్యులు, సమన్వయ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, మునిసిపల్ కౌన్సిలర్లు, ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు, వైస్-చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పరకాల పట్టణ కమిటీ, అన్ని వార్డు కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, పూర్తి కమిటీలు, అనుబంధ సంఘాలు సోషల్ మీడియా, మహిళా, యూత్, విద్యార్థి, బీసీ సెల్, ఎస్సీ సెల్, మైనారిటీ సెల్, కార్మిక, రైతు కమిటీల బాధ్యులు, సానుభూతిపరులు పాల్గొనాలని కోరారు.

## శశాంక్ భూపతికి కాకతీయ పురస్కార్ అవార్డు ప్రదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఏనుగుల రాకేష్ రెడ్డి నేతృత్వంలో నడుస్తున్న ఇండస్ ఫౌండేషన్ సంస్థ శుక్రవారం మహా శివరాత్రి సందర్భంగా హనుమకొండ హయగ్రీవ చారి కాంపౌండ్ లో ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హనుమకొండ న్యూ రాయపుర ప్రాంతానికి చెందిన శశాంక్ భూపతికి ప్రతిష్ఠాత్మకమైన కాకతీయ పురస్కారం అవార్డును ప్రదానం చేశారు. ఎవరూ కనుక్కోలేని విషయాలపై పరిశోధన చేసి ప్రపంచానికి చాటి చెప్పాలని ఉత్సాహంతో పని చేస్తారు కొందరు. ఆ కోవకు చెందిన వారే శశాంక్ భూపతి, వీరు ప్రస్తుతం %ూాఅషెఅవత్ ‾వఎష్ట్రఅశీశ్రీశీస్త్రఅవం% అనే సంస్థను స్థాపించి మన ఓరుగల్లు ప్రాంత విశిష్టతపై, ఇక్కడి ఆలయాలలో గల శక్తిపై, వరంగల్ ప్రాంతంలో గల నిగూఢమైన శక్తి గురించి శాస్త్రీయంగా పరిశోధనలు చేస్తున్నారు. శబ్ద తరంగాలు ద్వారా శక్తిని సృష్టించడం వీరి ప్రత్యేకత, సనాతన శాస్త్రీయ నిర్మాణాలపై ఇస్రోతో కలిసి పని చేస్తున్నారు. వీరు హనుమకొండ ప్రాంతానికి చెందిన సీనియర్ న్యాయవాది భూపతి శంకర్ కుమారుడు. పుట్టిన గడ్డ మీద ప్రేమతో ఈ ప్రాంత విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడం కోసం, ఈ రంగాన్నే తన వృత్తిగా ఎంచుకొని ఎంతో పురోగతి సాధిస్తూ, తనతో పాటు మరికొందరు ఔత్సాహిక యువతకు శశాంక్ భూపతి మార్గదర్శిగా నిలుస్తున్నారు.

# నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి



## అధికారులతో ఎమ్మెల్యే కడియం సమీక్ష

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులకు ఆదేశించారు. శనివారం హనుమకొండ ఎమ్మెల్యే కడియం నివాసంలో నియోజక పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ శాఖ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో మంజూరైన అభివృద్ధి పనులపైన చర్చించారు. సంబంధిత ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే నివాసంలో పెండింగ్ అంశాలు, నడుస్తున్న పనులు, ఆయా పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలనే పలు అంశాలను ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. ఆయా పనులను పర్యవేక్షించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నియోజకవర్గ మొత్తంలో రూ.40 కోట్ల విలువైన 33 పనుల పలు రోడ్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఒకరికోకరు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు అందరూ కృషిచేయాలని సూచించారు. నియోజక అభివృద్ధికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన 60వ డివిజన్ బీజేపీ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓరుగల్లు పర్యటనకు విచ్చేసిన కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని 60వ డివిజన్ భాజపా నాయకులు శాలువా కప్పి మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ డివిజన్ కమిటీ ముఖ్యులు కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ కు అండగా బీజేపీలో చేరగా వారందరూ అభినవ్ భాస్కర్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీరందరూ కష్టపడి పనిచేయలని సూచించారు. అనంతరం పలు అంశాలపై అభినవ్ భాస్కర్ తో కిషన్ రెడ్డి చర్చించి పలు సలహాలు, సూచనలు అందుకున్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండలంలోనిచిల్లంచెర్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (యుఎస్ఏ) వారి సహకారంతో స్ఫూర్తి ఎడ్యుకేష న్ సొసైటీ ద్వారా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని మిగతా విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంద జయ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సంస్థను అభినందించారు. భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు సహకారం అందించడం తమ లక్ష్యమన్నారు. సామాజిక కార్యకర్త, స్ఫూర్తి సొసైటీ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య మాట్లాడుతూ పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, అలాగే భవిష్యత్తులో మీరు ఉన్నత శిఖరాలు అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే అశోక్, శ్రీనివాస్, సంతోష్, శ్రీకాంత్, ప్రశాంత వాణి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు విస్మరించిన మోడీ సర్కార్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** గత తొమ్మిదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని సీపీఐఎంఎల్ మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. నేడు తొర్రూర్ లోని ఆర్టీసీ బస్సు స్టాండ్ వద్ద ప్రజాపంథ రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ 8వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మోడీ ప్రభుత్వం రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం తెస్తానని ఇచ్చిన హామీ అమలు చేయలేదన్నారు. హామీల అమలు కోసం ఢిల్లీకి వచ్చిన రైతులపై కాల్పులు జరిపి రైతు ఆదాయం రెట్టింపు చేస్తానని, అబద్ధపు ప్రచారాన్ని చేస్తున్నారని విమర్శించారు. దేశంలో 44 కోట్ల మందిగా ఉన్న సంఘటిత అసంఘటిత రంగాల కార్మికులను మరింత దోచుకోమని ఉన్న లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్ లుగా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని 9ఏళ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఏవని రవి ప్రశ్నించారు. దేశంలోని 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు చదువులు దూరం చేసే కుట్రలు జరుగుతుందన్నారు. దేశ ప్రజలకు ఇచ్చిన మౌలిక సమస్యల హామీని విస్మరించి అయోధ్యలో రాముడి గుడి కట్టి ప్రజల దృష్టిని మరల్చే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మూడోసారి అధికారంలోకి మోడీ సర్కారు వస్తే భారత రాజ్యాంగం అది ఇచ్చిన హక్కులు రిజర్వేషన్లు పూర్తిగా రద్దైపోనున్నాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికలలో చిత్తుగా ఓడించాలని ప్రజానీకానికి పిలుపునిచ్చారు. సీపీఐఎంఎల్ ప్రజాపంథా తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ఉద్యమం తప్పదన్నారు. తొర్రూరు డివిజన్ నాయకులు బండపల్లి వెంకటేశ్వర్లు, ఉడుగుల రాములు, సెగ్గం యాకయ్యతో పాటు డివిజన్ అధ్యక్షులు ఎర్రగొండ ప్రవీణ్, సుమన్, వెంకన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 12న విజయ సంకల్ప మహా సమ్మేళనం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** శనివారం తొర్రూరు పట్టణంలో స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ సభాధ్యక్షతన పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆపై స్థాయి కార్యకర్తల 'విజయ సంకల్ప మహాసమ్మేళనం' సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం లో మరోసారి మోడీ సర్కార్ లక్ష్యం తో ఈనెల 12న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆపై స్థాయి కార్యకర్తల 'విజయసంకల్ప మహా సమ్మేళనం' ఏర్పాటు చేయడం జరిగిందని , కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. బూత్ కమిటీ అధ్యక్షులు, వివిధ మోర్చాల బాధ్యులు, రాష్ట్ర, జిల్లా, మండల, పదాధికారులు, శక్తి కేంద్రం ఇంచార్జిలు తప్పకుండా హాజరు కావాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కావడం ఖాయమని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా వంట గ్యాస్ పై వంద రూపాయలు తగ్గించి మహిళలకు మోడీ కానుకగా అందించారని తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ శ్రేణులు శక్తి వంచన లేకుండా పనిచేసి మూడోసారి అఖండ విజయం సాధించడం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల, శక్తి కేంద్రం ఇంచార్జిలు, బూత్ కమిటీ అధ్యక్షులు, వివిధ మోర్చాల బాధ్యులు అలిసేరి రవిబాబు, రచ్చ కుమార్, మంగళపల్లి యాకయ్య, పైండ్ల రాజేష్, గడల శేఖర్, గట్ల భరత్, ఆర్ . రాజకుమార్, కాగు నవీన్, గంధం రాజు, పప్పుశెట్టి సంతోష్, నూకల నవీన్, నడిగడ్డ సందీప్, జగదీష్, శ్రీనాథ్, నాగేష్ నాయక్, హరీష్, తూర్పాటి రమేష్, బి.రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ ఉద్యోగాల సంఖ్యను పెంచాలి

### ప్రజా సంక్షేమ వేదిక రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల డీఎస్సీ నోటిఫకేషన్ విడుదల చేయడం హర్షిస్తున్నాం, కానీ, తెలంగాణలో బీఈడీ, టీటీసీ పూర్తి చేసిన యువతీ యువకులు లక్షలాది మంది నిరుద్యోగులు నిరాశతో ఉన్నారు. కాబట్టి, డీఎస్సీ ద్వారా భర్తీ చేసే స్కూల్ అసిస్టెంట్స్ పోస్టుల సంఖ్యను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజా సంక్షేమ వేదిక రాష్ట్ర నాయకుడు శనిగరపు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో వివిధ నోటిఫికేషన్ల ప్రశ్నాపత్రాలు లీకేజీలతో ఉద్యోగాల భర్తీకి ఆటంకం కలిగిందన్నారు. మరో పక్క కొన్ని శాఖల ఉద్యోగాల పక్రియ కోర్టు కేసుల మెట్లు ఎక్కి బ్రేకులు పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు వస్తాయని ఎంతో ఆశతో ఉన్నత చదువులు చదివిన నిరుపేద యువతీ యువకులు సంవత్సరాల తరబడి గ్రంథాలయాల్లో ఎంతో కష్ట పడి చదివితే నిరాశ మిగిలిందని వాపోయారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వంలోనైనా ప్రభుత్వ ఆయ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చి త్వరగా ఉద్యోగాలను భర్తీ చేయాలని శనిగరపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

## కూనంనేని సమక్షంలో సీపీఐలో చేరిన వేల్పుల సారంగపాణి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో హనుమకొండకు చెందిన కార్మిక నాయకులు వేల్పుల సారంగపాణి సీపీఐలో చేరారు. శనివారం హైదరాబాద్ లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్ ఈ మేరకు కూనంనేని సాంబశివరావు సీపీఐలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీపీఐలో చేరిన వారిలో వేల్పుల సారంగపాణితో పాటు కోమటి రమేశ్, గండు సత్యం తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నదని, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించడంలో ముందంజలో ఉందన్నారు. నగరంలో కార్మిక నాయకులుగా పని చేస్తున్న వేల్పుల సారంగపాణి లాంటి వారు సీపీఐలో చేరడం హర్షనీయమన్నారు. రానున్న రోజులలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు ఏశబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు శ్రీ వరద దత్త క్షేత్రంలో తైలాభిషేకం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు శ్రీ వరద దత్త క్షేత్రంలో ఉదయం 9:30 గంటలకు స్వామికి సుగంధ తైలాభిషేకం నిర్వహించబడు, కాబట్టి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీ వరద దత్త క్షేత్రం, ఎస్జీఎస్ దత్త జ్ఞానబోధ సభ వరంగల్ ట్రస్ట్ కోరింది. శ్రీ స్వామివారి తైలాభిషేకం చేయడం వలన గ్రహ దోషాలు, గ్రహ పీడల నుంచి విముక్తి కలిగి గురు బలం పెరిగి మన పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా జరుగునన్నారు.

## వృద్ధులకు వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవరం వన్నెల్ క్రాస్ వద్ద ఉన్న శ్రీ కనక వృద్ధాశ్రమంలో శ్రీమాతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరం నిర్వహించి వృద్ధులందరికీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ముద్దసాని మల్లిక, ప్రధాన కార్యదర్శి నన్నపనేని సంజీవరావు, ఉమాదేవి, రమ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని కలిసిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మూడు నెలల వేతనాలు, ఏడు నెలల పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని శనివారం ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు, మహబూబాబాద్ ఎన్ హెచ్ ఎం జిల్లా నాయకులు సొన శౌషిల్య, కిషోర్ , రాజ్ కుమార్,నితిన్ పవన్, వి.రాజ్ కుమార్, వీనిత్ , సాయి శ్రీ , వెన్నెల, మమత, రేవతి పాల్గొన్నారు.

## నయీంనగర్ పెద్ద మోరి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నయీంనగర్‌లో పెద్ద మోరిని వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా నాయిని నాలా పనులను పరిశీలించి నాలా విస్తీర్ణం సైడ్ వాల్స్ పెద్ద మోరి బ్రిడ్జ్ విస్తీర్ణం పైపు లైన్ ఏర్పాటు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నో ఏళ్లుగా వర్షాకాలంలో నయీం నగర్ ప్రాంత ప్రజలు వరదలతో ముంపుకు గురై ఎన్నో బాధలు, అవస్థలు, ఆస్తి నష్టాలు, ప్రాణ నష్టాలు ఎదుర్కొంటున్నారని మరోసారి వర్షాకాలంలో ఎలాంటి నీటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు, ఏఈలు, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, నల్ల సత్యనారాయణ, పల్లె రాహుల్ రెడ్డి, మొహమ్మద్ ముస్తాక్ నేహాల్, కొండుక ప్రదీప్ కుమార్, తడక సుమన్, బాలు నాయక్, నిఖిల్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, పరకాల :** గీసుగొండ మండలం మనుగొండ గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించిన గుండాల స్వామి కుటుంబాన్ని పరామర్శించి, అనారోగ్యంతో ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నల్ల సరోజన కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని నింపి అల్లం బాలకిషోర్ రెడ్డి రూ. 5000ల చొప్పున ఆర్థిక సహాయం పంపించగా కాంగ్రెస్ మండల నాయకుడు అల్లం మర్రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజు, మాదాసి రాంబాబు, గాడిదల కొమురయ్య, మర్రి ఎల్లయ్య, లంబాడి మహేందర్, ఎంబాడి రాజమౌళి, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సైని విధుల నుంచి తొలగించాలి

### మైనార్టీ రాష్ట్ర నాయకుడు మహ్మద్ అమీర్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు పట్టణ కేంద్రంలో శనివారం మైనార్టీ రాష్ట్ర నాయకులు మహమ్మద్ అమీర్ మాట్లాడుతూ ఢిల్లీలోని ఇందర్ లోక్ ఏరియాలో గల మసీదులో నమాజ్ చదువుకోవడానికి స్థలం లేకపోవడంతో రోడ్డుపై నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులను ఢిల్లీలోని ఇందర్ లోక్ ఏరియాకి సంబంధించిన ఒక ఎస్ఐ తాను ఎస్ఐ అని మర్చిపోయి మదమెక్కి తన కాలుతో నమాజ్ చదువుతున్న వారిని తన్నడం సభ్య సమాజం తల దించుకునేలా చేయడం సిగ్గుచేటని పేర్కొంటూ భారతదేశం సర్వమతాలకు నిలయమంటూ ఒక మతాన్ని మరొక మతం వారు గౌరవించుకోవడం భారతదేశ సంప్రదాయమన్నారు. భిన్నత్వంలో ఏకత్వం గల దేశంలో ఇలాంటి మూరు?ల వల్ల దేశంలో మతాల మధ్య కులాల మధ్య ఘర్షణలు ఏర్పడే అవకాశం ఉంటుందని కాబట్టి, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకొని అతడిని విధుల(సర్వీస్) నుంచి శాశ్వతంగా తొలగించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని కోరారు. ముస్లింల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఆఎస్సై వ్యవహరించడం చాలా దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా ఢిల్లీ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతమైతే ముస్లింల ఆగ్రహానికి ఢిల్లీ, కేంద్ర ప్రభుత్వాలుగురికాక తప్పదన్నారు.

# 12న హైదరాబాద్‌లో మహిళా సదస్సు

### జిల్లా నుంచి వెళ్లేందుకు ఏర్పాట్లు
### భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఈ నెల 12న హైదరాబాద్ లో నిర్వహించనున్న మహిళా సదస్సుకు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 12న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో లక్ష మంది స్వయం సహాయక మహిళలతో మహిళా సదస్సు నిర్వహించనున్న సదస్సుకు మన జిల్లా నుంచి మహిళలు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ సదస్సుకు మున్సిపాలిటీతో పాటు అన్ని మండలాల నుంచి మహిళలను పంపుటకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా బస్సులతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో మహిళలు హైదరాబాద్ పంపుటకు 11 బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో బస్సు లో 50 మంది చొప్పున మొత్తం 550 మందిని పంపనున్నట్లు ఆయన చెప్పారు. మున్సిపాలిటీతో అన్ని మండలాల్లో ఎంపీడీఓలు ప్రవేక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. మహిళా సదస్సుల్లో పాల్గొనే మహిళలకు ఐడీ కార్డులు జారీ చేయాలని చెప్పారు. ఉదయం అల్పాహారం, మంచినీళ్ల బాటిల్స్ అలాగే మధ్యాహ్నం, రాత్రి భోజన ఏర్పాట్లుతో పాటు పర్యవేక్షణకు ప్రతి మండలం నుండి ఒక్కో బస్సుకు ఇద్దరు లైజనింగ్ అధికారులు, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం తిరిగి క్షేమంగా వచ్చే వరకు రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతలు డీఆర్డీఓ నరేష్ కు అప్పగించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

# ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గద్దర్ ఆలోచన ఐక్య వేదిక కమిటీ తాళ్లపెల్లి విజయ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహం, గద్దర్ కళా క్షేత్రం, పాఠ్య పుస్తకాలలో గద్దర్ జీవిత పెట్టేలా కృషి చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించి మంత్రులు, కలెక్టర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గద్దర్ ఆలోచన ఐక్య వేదిక కోకన్వీనర్ సుద్దాల నాగరాజు మాట్లాడుతూ గద్దర్ బ్రతికినంత కాలం ప్రజలకు సేవ చేస్తూ బతికారన్నారు. తెలంగాణ ఉద్యమ గొంతుక గద్దర్ అని పేర్కొన్నారు. ఆనాడు తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఆట పాటలతో ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకొని హనుమకొండ హయగ్రీవచారి గ్రౌండ్ లో ప్రభుత్వ భూమిని కేటాయించి గద్దర్ కళా క్షేత్ర ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గద్దర్ ఐక్యవేదిక కమిటీ సభ్యులు అజ్మీరా వెంకట్, సోషల్ మీడియా కన్వీనర్ గజ చందు రామ, సుందర్ నగర్ భక్షి, శివ, దాసరి రమేష్, మొలుగూరి యాకయ్య, రానా, సాగర్, ఐతే అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# పస్తం శ్రీను మృతదేహానికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని శంభునిపేట ప్రాంతానికి చెందిన పస్తం శ్రీను శుక్రవారం మృతిచెందారు. పస్తం శీను హుజూరాబాద్ లో ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం చేస్తున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం అకాల మరణం చెందారు. శ్రీను మరణ వార్త తెలుసుకొని శనివారం వారి పార్థివ దేహానికి చిన్ననాటి మిత్రుడే జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కంచ ప్రసాద్, మండల హేమంత్, గుండు పూర్ణచందర్, దేవులపల్లి కమలాకర్, దామెరకొండ కరుణాకర్, బజ్జూరి వీరేశం, బుక్క సతీష్, శంకేసి లింగమూర్తి, శంకేశి సధాకర్, మాధవ్, కేదాసి ప్రవీణ్, పత్తి మల్లికార్జున్, హరి శంకర్, నారుద్దీన్, దేవునారి వెంకన్న, మాదుగుల రాజ్ కుమార్, ఆబిదు మిత్ర బృందం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడి సోదరులు పస్తం రవి కిరణ్, హుస్నాబాద్ పీపీ పస్తం రామకృష్ణ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ మోహన్, హుజూరాబాద్ పీపీ, హుస్నాబాద్ పీపీ, 41వ డివిజన్ కార్పొరేటర్ గోశాల పద్మ స్వామి గౌడ్, రంగసాయిపేట, శంభునిపేట, మామునూర్ చిన్ననాటి స్నేహితులు, మిత్ర బృందం, తదితరులు మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

# కేంద్ర ఫాసిస్ట్ విధానాలపై పోరాడుదాం

### మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** దేశంలో పాలకవర్గాల అవలంబిస్తున్న అభివృద్ధి నిరోధక విధానాల వలన దేశం ప్రపంచం ముందు తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని శనివారం హసన్ పర్తి మండలం వంగపాడు గ్రామంలో దోమ మధున అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మెజారిటీ వాదం పేరుతో మైనార్టీలపై, వామపక్ష వాదులపై, దళితులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉత్తరాది రాష్ట్రాలలో, మణిపూర్, అస్సాంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు. హడావుడిగా పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి అమలు చేయడాన్ని 2029కి మార్చడాన్ని ఆక్షేపించారు. పార్లమెంటులో మహిళల ప్రాధాన్యత విషయంలో మిగతా ప్రజాస్వామ్య దేశాలతో పోల్చితే భారతదేశం వెనుకబడి ఉందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఏరియన్ యూనియన్ సంస్థ అధ్యయనం ప్రకారం 185 దేశాల్లో 141గా ఉందని, 545 మంది లోకసభ సభ్యులలో కేవలం 78 మంది మాత్రమే మహిళలు ఉన్నారని, ఇది కేవలం 14శాతం మాత్రమేనని తెలిపారు. రోవాండ దేశంలో 49 మంది మహిళలు చట్టసభలలో ఉన్నారని, అది 61శాతం రిజర్వేషన్ అని తెలుపుతూ రువాండా ప్రభుత్వాన్ని అభినందించారు. ఇండియాలో కూడా 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే మోడీ పెట్టిన 33 శాతం రిజర్వేషన్లు ప్రస్తుత ఎన్నికలలో అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని జ్యోతిని మహిళలు సన్మానించారు. ఈ సమావేశంలో హసన్ పర్తి మండల భారత కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, సీపీఐ హనుమకొండ జిల్లా సమితి సభ్యులు నేదునూరి సూరి రాజమౌళి, వంగపాడు గ్రామ శాఖ కార్యదర్శి దోమ రాకేష్, సీపీఐ నాయకులు ఎర్ర కుమారస్వామి, కొత్తగట్టు శ్యాంసుందర్, దొమ్మాటి ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, దోమ జ్యోతి, దాసు సరోజన, మంజుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కరీమాబాద్ లో విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట ఆడుతున్న ఓ ఇంటిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతూ ఆరుగురు పట్టుబడగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రూ.24 వేల నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన వారిలో గడ్డం భాస్కర్, గడ్డం రాజు, మాడిశెట్టి శ్రీనివాస్, పాలకుర్తి సారంగపాణి, దేవర రమేష్, దాసి రాజు ఉన్నారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ ఎస్.రవి కుమార్, ఎస్సై బి .శరత్, టాస్క్ ఫోర్స్ బృందం పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన మార్నేని రవీందర్ రావు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆయన సతీమణి ఐనవోలు ఎంపీపీ మధుమతి శనివారం కాంగ్రెస్ గూటికి చేరారు. హైదరాబాదులో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం పెరగనుందని రాజకీయ విశ్లేషకులు మేధావులు చర్చించుకుంటున్నారు. కారణం ఏదైనా మంచి నిర్ణయం తీసుకున్నారని కార్యకర్తలు ప్రజల్లో చర్చ నడుస్తుంది.

# రాయల రవన్న ఆశయాలను కొనసాగిద్దాం

### ప్రజా పంథా జిల్లా కార్యదర్శి చిర్ర సూరి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత విప్లవోద్యమ చరిత్రలో చిరస్మరణీయుడు కామ్రేడ్ రాయల రవన్న అలియాస్ సుభాష్ చంద్రబోస్ అని, ప్రజలంతా విప్లవోద్యమంలో భాగస్వాములై కామ్రేడ్ రవన్న ఆశయాలను కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ పడమరకోట చమన్ లో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రాయల రవన్న అలియాస్ సుభాష్ చంద్రబోస్ 8వ వర్ధంతి సందర్భంగా రవన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ దేశంలో తాడిత, పీడిత, ఆదివాసి ప్రజల రాజ్యం తీసుకురావాలని విప్లవోద్యమంలో 48 సంవత్సరాలుగా అజ్ఞాత దళనేతగా పనిచేస్తూ అనారోగ్యంతో ఎనిమిది సంవత్సరాల క్రితం అమరుడైనాడని గుర్తు చేశారు. దేశంలో పెట్టుబడి దారి భూస్వాముల దోపిడీ పీడన, అణచివేతల నుంచి ప్రజలను విముక్తి చేయడానికి, ఆదివాసీలకు భూమిపై హక్కు కల్పించడం కోసం అజ్ఞాతంలో ఉంటూ అనేక పోరాటాలు నిర్వహించిన వ్యక్తి కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. అడవి ఉద్యమాన్ని మైదాన ప్రాంత ఉద్యమాన్ని సమన్వయం చేస్తూ విప్లవోద్యమ నిర్మాణ అభివృద్ధికి జీవితాంతం కృషిచేసిన గొప్ప విప్లవ రథసారథని తెలిపారు. ప్రస్తుతం నరేంద్ర మోడీ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా కుల మతోన్మాద ఫాసిస్టు పాలనను కొనసాగించటం వలన ప్రజల స్వేచ్ఛ, పౌరుల ప్రజాస్వామిక హక్కులు, దేశ లౌకిక వ్యవస్థ ప్రమాదంలో పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలంతా కామ్రేడ్ రాయల రవన్న ఆశయ సాధనకై విప్లవోద్యమంలో క్రియాశీలక భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు పాణి, ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు పసునూరి రాజు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు కట్కూరి వెంకటస్వామి, రాజేందర్, గాడిపెల్లి ప్రవీణ్, రాజు, ల్యాదల్ల ఎల్లయ్య, చంటి, తదితరులు పాల్గొన్నారు.

# సంరక్ష హాస్పిటల్‌లో ఘనంగా మహిళా దినోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో శనివారం మధ్యాహ్నం అంతర్జాతీయ మహిళా దినోత్సవం హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ .సంధ్యారాణి (కేఎంసీ మాజీ ప్రిన్సిపాల్), డాక్టర్ ఉషారాణి, డాక్టర్ వై.పద్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా, ఘనంగా పెద్ద ఎత్తున్న జరిగింది. ముందుగా కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. తర్వాత ఏడుగురు మహిళ డాక్టర్లను హాస్పిటల్ యాజమాన్యం శాలువాలతో, బొకేలతో, మొమెంటోలతో సన్మానించారు. సన్మాన గ్రహీతలు డాక్టర్ హెచ్.సంధ్యారాణి డైరెక్టర్, మాజీ ప్రిన్సిపల్ కేఎంసీ, డాక్టర్ ఎన్.ఉషారాణి, డాక్టర్ వై.పద్మ( సీకేఎం మాజీ సూపరిండెంట్), డాక్టర్ కస్తూరి ప్రమీల (ఐఎంఏ స్టేట్), డాక్టర్ ఆర్. మాధవి (కార్డియాలజిస్ట్ ), డాక్టర్ మేఘన (ఫీజీషీయెన్), డాక్టర్ శ్రావ్య రెడ్డి (సర్జన్ )లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ వై.పద్మ, డాక్టర్ కస్తూరి ప్రమీల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురోగతిని సాధించడమే కాకుండా, మహిళ సాధికారత కోసం, పురుషులపై ఆధిక్యత సాధించాలన్నారు. మహిళలందరూ విద్యావంతులు కావాలని తద్వారా కుటుంబం, సమాజం మొత్తం బాగుంటుందని తెలిపారు. ఈ మహిళా దినోత్సవ వేడుకలలో సన్మాన గ్రహీతలతో పాటు డాక్టర్ ప్రసన్న, డాక్టర్ సరితా, విద్యాధరి, హెచ్ఆర్ మౌనిక , జ్యోతి , తేజ, గౌతమి, ఝాన్సీ, నివేదిత, స్వర్ణలత, రజిత, స్వాతి, సాగరిక, ఆస్మా, శిరీష, ఫర్జానా, అక్షయ, ఇదర్సి తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్ కాదు అనుభవం చూసి ఉద్యోగం ఇవ్వండి



**వరంగల్ వాయిస్, ములుగు :** వైద్యారోగ్య శాఖలో చేపట్టిన ప్రస్తుత నియమాకాలను అవుట్ సోర్సింగ్ లో చేస్తున్న నర్సింగ్ ఆఫీసర్ కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు గాదె రమేష్, ఎండీ ఫజల్ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి వారు విధులు నిర్వర్తించారని, అలాగే వాళ్లకు రెగ్యులర్ పోస్టుల్లో ఇప్పుడు ప్రభుత్వం వేయిటేజ్ కల్పించిందని, ఇప్పుడు చేపట్టబోయే ఎన్ హెచ్ఎం నియామకాలలో కూడా అదే తరహాలో భర్తీ చేయాలని వారన్నారు. ఇంతకుముందు నర్సింగ్ చదివిన విద్య వైద్య విద్యార్థులు 1200 మార్పులు ఒక స్లాబ్ గాను, గంతో జీఎన్ఎం చేసిన వారు 1900 మార్కులు గాను, ఇప్పుడు చేస్తున్న నర్సింగ్ విద్యార్థులకు ఈరోజు 2900 ఉండడం వలన ఒకే చదువు చదివినప్పటికీ మార్కులలో వ్యత్యాసం ఉండడంతో మెరిట్ ఆధారంతో ఎంపిక చేయబడుతుందని తెలిపారు. దీంతో ఇంతకుముందు చదివిన నర్సింగ్ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. అలాగే ఉమ్మడి భూపాలపల్లి జిల్లా ఉన్నప్పుడు నియమింపబడ్డ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడంపై ఇది అన్యాయమని వారు ఆరోపించారు. వీలైనంత త్వరలో ఈ సమస్యలను పరిష్కరించాలని, జిల్లా అధికారులు వినతి పత్రంతో పాటు సంబంధిత డీసీహెచ్ఎస్ డాక్టర్ జగదీష్, వైద్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే ముప్పయ్య వినతి పత్రం అందజేసి వారి గోడు వెళ్లబుచున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ అండ్ హెల్త్ యూనియన్ నాయకులు సర్దార్ వేణు నాయక్, తిరుపతి, వంగ రాజయ్య, కుమార్, రమేష్, రవి, విజయ్ తదితర వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నెహ్రూ యువ కేంద్రం నర్సంపేటఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా నారి శక్తి ప్రోగ్రాంను ఎన్ వైవీ పురుషోత్తం యాదవ్ నిర్వహించారు. మహిళలకు పరుగు పందెం నిర్వహించి బహుమతులు ప్రదానం చేసి, టీ షర్ట్, క్యాప్, కప్ లు అందజేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో రాణించి నారి శక్తిని చాటాలన్నారు. ప్రస్తుతం దేశంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా నారీమణులను సత్కరించుకోడం కోసం నెహ్రూ యువ కేంద్రం ఈ ప్రయత్నాన్ని చేసిందని తెలిపారు. రాజకీయ, సామాజిక రంగంలో మహిళల పాత్ర పెరగాలని అలా అయితేనే రాజకీయ, సామాజిక రంగంలో నేరస్థుల పాత్ర తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బహుమతులు పొందిన వారిలో స్ఫూర్తి, తేజస్విని, లక్ష్మిప్రియలు , రాణి, భవ్య, మమత, స్రవంతి, అనూష, శారదా, మంగ, రాజేశ్వరిలు ఉన్నారు.

## గుడిసెలు దగ్ధం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని చెరువు కొమ్ము తండా గ్రామంలో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ధరావత్ ధర్మ, ధరావత్ ఇజ, ధరావత్ శ్రీనుకు చెందిన పూరి గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సంఘటన స్థలాన్ని స్థానిక తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ శంకర్ సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. తక్షణ సాయం కింద నిత్యావసర సరుకులు అందజేస్తామని, ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. వీరి వెంట ఆర్ఐ భారతి, పంచాయతీ సెక్రటరీ రమాదేవి ఉన్నారు.

## వైభవంగా శివపార్వతుల కళ్యాణం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గుడిలోమహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి శివపార్వతుల కళ్యాణ మహొూత్సవాన్ని అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి వైభవంగా వేదమంత్రాల మధ్య నిర్వహించారు. అంతకుముందు దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను మంగళ వాయిద్యాల మధ్య తీసుకువచ్చి స్వామివారి కళ్యాణానికి అందజేశారు. కళ్యాణం అనంతరం అర్ధరాత్రి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రతిష్ఠించి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. గ్రామస్తులు స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి మంగళ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి, వినుకొండ శంకరాచారి, అనుకారి అశోక్, చేరాల రాకేష్, భాషని సదాశివుడు, బాలకృష్ణ, వేణు, శంకరయ్య, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భారతీయ నాటక కళా సమితి స్వర్ణోత్సవం

## హాజరైన ఈగ మల్లేశం

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** పట్టణ కేంద్రంలో భారతీయ నాటక కళా సమితి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం నిర్వహించిన స్వర్ణోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హాజరై నటరాజ స్వామికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ నాటక రంగం అనేది సామాజిక స్పృహ, ప్రేమ, ఆదరణ, తల్లిదండ్రుల ఆప్యాయత అని కొనియాడారు. నిజ జీవితంలో నాటక రంగం అనేది ఒక పెద్దన్న పాత్ర పోషిస్తుందని తెలిపారు. వాస్తవంగా నేటి యువత ఆనాటి చరిత్ర తెలుసుకోగలిగితేనే పెడదారిన కాకుండా సక్రమ దారిలో నడిస్తారని, అది నాటక రంగం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఇప్పుడున్న ఆధునిక కాలంలో యువత నిలకడ లేని స్థితిలో ఉండి అనుకున్న గమ్యం చేరుకోలేక తటస్థమైన స్థితిలో ఉంటూ ఎంతోమంది యువకులు రోడ్డున పడుతున్నారని తెలిపారు. ఈ కళావేదిక ఉమ్మడి రాష్ట్రంలోనే ఎంతోమంది కళాకారులను పెంచి పోషించి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ భారతీయ నాటక కళ సమితి అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గం సేవలు, వారు నిత్యం పడుతున్న తపన సమాజానికి అందిస్తున్న స్ఫూర్తి మరువలేనిదన్నారు. 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ ప్రత్యేక సంచిక విడుదల చేయడం నాకు ఎంతో సంతోషంగా ఉందని ఈగ మల్లేశం తెలిపారు. అనంతరం భారతీయ



నాటక కళా సమితి అధ్యక్ష, కార్యదర్శులు గాడిపెల్లి రాజేశ్వర్, ఈగ సాంబయ్య ఈగ మల్లేశంను శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ నాటక కళా సమితి పూర్వ అధ్యక్షుడు వనం లక్ష్మి కాంత రావు, డాక్టర్ కళాధర్ రాజు (అల్లూరి సీతారామరాజు), బలగం సినిమా నటించిన కేతిరి సుధాకర్ రెడ్డి (కొమురయ్య), చిత్ర పరిశ్రమ కళాకారుడు కిషోర్, సినీ డైరెక్టర్ శ్రీనివాస్, చిటూరి అశోక్, సంగీత కళాకారుడు మోటపోతుల నవీన్, బోయినపల్లి పురుషోత్తం రావు, ప్రస్తుత భారతీయ నాటక కళా సమితి కార్యవర్గం గాడిపల్లి రాజేశ్వర్, మాసెట్టి సోమయ్య, ఈగ సాంబయ్య, ఎండీ అప్సర్, పెద్దూరి సంజీవరావు, సిలువేరు కుమారస్వామి, సమ్మెట శ్రీనివాస్, తుమ్మల యాకయ్య, గోశాల సూర్యనారాయణ, వడ్లకొండ రాజు, మోడెం కుమారస్వామి, ఎంపీ భాస్కరా చారి, అన్నమనేని కమలాకర్ రావు, గుజ్జ సోమేశ్వర్ రావు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

## 11న కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

### ఎంపీపీ రాణీబాయి రామారావు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎంపీపీ బి.రాణీబాయి రామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాదేవపూర్ మండలంలోని 102 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తామని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు గ్రామాల నుంచి లబ్ధిదారులను తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు పాల్గొనాలని ఎంపీపీ బి. రాణీబాయి రామారావు ప్రకటనలో పేర్కొన్నారు.

# గ్యాంగ్ ఆఫ్ గోదావరి ..



టాలీవుడ్ నటుడు విశ్వక్‌సేన్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే విశ్వక్ నటించిన గామి చిత్రం ప్రేక్షకుల ముందుకురాగా మరో సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్నాడు. విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. ఈ సినిమాకు ఛల్ మోహన్ రంగ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నాడు. అంజలి, డీజే టిల్లు ఫేం నేహాశెట్టి హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. ఇక మహిళా దినోత్సవం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. మూవీ నుంచి కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఇక ఈ పోస్టర్‌లో అంజలి కత్తి పట్టుకుని ఊరమాస్ లుక్‌లో కనిపిస్తుంది. ఇక ఈ సినిమాను మొదట మార్చి 8న విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. అనుకోని కారణాల వల్ల ఈ సినిమా వాయిదా పడుతూ వస్తుంది. ఇక త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

## లంబసింగి


భరత్‌రాజ్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'లంబసింగి' .. ఎ ప్యూర్ లవ్‌స్టోరీ... అనేది ఉప శీర్షిక. నవీన్ గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. 'బిగ్ బాస్' ఫేమ్ దివి కథానాయికగా నటిస్తున్నారు. ఆనంద్.టి నిర్మిస్తున్నారు. దర్శకుడు కల్యాణ్‌కృష్ణ కురసాల సమర్పకులు. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తిచేసుకున్న ఈ చిత్రం ఈనెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఇందులోని 'వయ్యారి గోదారి నువ్వే... నా దారికొచ్చి చేరావులే...' అంటూ సాగే పాటని విడుదల చేసింది చిత్రబృందం. ఈ పాటకి కాసర్ల శ్యామ్ సాహిత్యం సమకూర్చగా, జావేద్ అలీ ఆలపించారు. ఆర్.ఆర్.ధ్రువన్ స్వరకర్త. ఈ మెలోడీ పాటకు సంగీత ప్రియుల నుంచి మంచి స్పందన వస్తోంది.



## కన్నప్ప నుంచి ఫస్ట్‌లుక్

మంచు విష్ణు ప్రధానపాత్రలో నటిస్తోన్న ఫాంటసీ డ్రామా 'కన్నప్ప' రూపుదిద్దుకొంటోంది. ముకేశ్ కుమార్‌సింగ్ దర్శకుడు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ నుంచి చిత్ర బృందం సర్‌ప్రైజ్ ఇచ్చింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 'కన్నప్ప' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఇందులో మంచు విష్ణు కన్నప్పగా కనిపించి అలరించారు. భారీ బ్జడెట్, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో సీనియర్ నటుడు మోహన్‌బాబు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్‌–నయనతారలు శివపార్వతులు గా కనిపించనున్నారని టాక్ వినిపిస్తుండగా, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టీఫెన్ దేవస్సే, మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. 'కన్నప్ప' చిత్రం అత్యధిక భాగాన్ని న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు.



## నాగసాధువులా తమన్నా

ఓటీటీ చిత్రం 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ అయిన 'ఓదెల 2'చిత్రం ఇటీవలే కాశీలో గ్రాండ్‌గా ప్రారంభమైంది. అశోక్ తేజ దర్శకత్వంలో సంపత్ నంది క్రియేటర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్‌లపై డి మధు హై బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, ఈ చిత్రంలో శివశక్తి పాత్రలో నటిస్తున్న తమన్నా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాత్ర కోసం తమన్నా కంప్లీట్‌గా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. నాగ సాధువులా వేషం ధరించి.. ఒక దండము, మరో చేతిలో ఢమరుకం, నుదుటిపై పసుపు బొట్టు, దానిపై కుంకుమ బిందువుతో శివశక్తిగా అద్భుతం అనేలా తమన్నా దర్శనమిస్తోంది. కాశీ ఘాట్‌లపై నడుస్తూ, ఆమె కళ్ళు మూసుకుని దేవుడిని ప్రార్థిస్తూ కనిపిస్తున్నారు. తమన్నా విషయంలో ఇది అన్ బిలివబుల్ మేకోవర్ అనే చెప్పుకోవాలి. ఈ ఏజ్ హీరోయిన్లలో ఏ హీరోయిన్ కూడా ఇలా కనిపించింది లేదు. ఈ ఫస్ట్‌లుక్ అందరినీ ఆకట్టుకుంటూ.. శివరాత్రికి ఇది పర్ఫెక్ట్ ట్రీట్ అనేలా ఉంది. ఓదెల 2 గ్రామం చుట్టూ కేంద్రీకృతమై, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా రక్షిస్తాడనే అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా ముఖ్య తారాగణం. ÷ఎఈచీ సినిమాలో టాప్ క్లాస్ ఉండబోతున్నాయని, 'ఓదెల 2' కోసం ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేయబోతున్నారని మేకర్స్ తెలుపుతున్నారు. యూనివర్సల్ అప్పీల్ ఉండే ఈ సినిమా నేషనల్ వైడ్‌గా విడుదల కానుందని మేకర్స్ తెలియజేశారు. కాగా.. సౌందర్ రాజన్ ఎస్ డీవోపీగా పని చేస్తుండగా, కాంతార ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

# వాటా కోసం..

## బీసీ మహా పాదయాత్ర
## వంద కిలోమీటర్లు పూర్తి
## హైదరాబాద్ చేరిన బృందానికి ఘన సన్మానం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** చట్టసభల్లో బీసీల జనాభా దామాషా ప్రకారం వాటా కావాలని కోరుతూ 86 సంఘాలతో ఏర్పాటైన ఆల్ ఇండియా ఓబీసీ జాక్ నాయకత్వంలో ఈ నెల ఒకటిన మహా వీరుడు పండుగ సాయన్న స్వగ్రామం మహబూబ్ నగర్ జిల్లా మిరుగోన్ పల్లిలో ప్రారంభమైన బీసీ మహా పాదయాత్ర శనివారం హైదరాబాద్ కు చేరుకుంది. సాయిని నరేందర్, మేకపోతుల నరేందర్, బత్తుల సిద్దేశ్వర్ల ఆధ్వర్యంలో సాగుతున్న ఈ పాదయాత్రకు ఊరూరా సామాజిక, ప్రగతిశీల సంఘాల నాయకులు ఘన స్వాగతం పలుకుతున్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు దాటినా బీసీల కులగణన లేక, చట్టసభల్లో సముచిత స్థానం లేకుండా ఆత్మగౌరవం లేకుండా జీవిస్తున్న వారికి సకల సామాజిక రంగాల్లో మేమంతమందిమో మాకంత వాటా రావాలన్న ప్రధాన ధ్యేయంతోనే పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మధ్యాహ్న విరామం, రాత్రికి బస కల్పిస్తూ యాత్రకు అండగా నిలుస్తున్నారు. పాదయాత్ర హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విముక్త చిరుతల కక్షి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీ వాటా సాధన కోసం ఆల్ ఇండియా ఓబీసీ జాక్ నాయకత్వంలో నిర్వహిస్తున్న పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 100 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకొని గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకున్న బృందానికి వివిధ ప్రజా సంఘాలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి సత్కరించారు. పాదయాత్ర బృందం అమరవీరుల స్థూపానికి పూలు వేసి నివాళులు అర్పించారు. అమరవీరుల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ వాటా సాధిస్తామన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్దకు చేరుకొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్, నూర్ బాషా సంఘం షేక్ సత్తార్ మాట్లాడుతూ బాపూజీ గొప్పతనం గూర్చి వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి, త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని చట్టసభల్లో బీసీ వాటా సాధించాలని పిలుపునిచ్చారు. టాంక్ బండ్ పై మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్, బీసీ హక్కుల కోసం న్యాయపరమైన సేవలు అందించిన పుంజాల శివశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఆయన స్ఫూర్తితో బీసీ హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం, నాయకులు ఏటిగడ్డ అరుణ పటేల్ పాల్గొని మాట్లాడారు. ఉత్పత్తి, శ్రమలో కీలకపాత్ర పోషిస్తున్న బీసీలకు చట్టసభల్లో వాటా కోసం కొనసాగుతున్న మహా పాదయాత్రకు అడుగడుగునా అండగా ఉంటానన్నారు.

ఈ పాదయాత్రలో విద్యార్థి వెలుగు వనిత మహిళలు విమల, సింగారపు అరుణ, సద్గుణ, స్వరూప, ఏటిగడ్డ అరుణ పటేల్, సూరారపు రమారెడ్డి, స్వాతిలతో పాటు విశ్వపతి, చెన్న శ్రావణ్ కుమార్, న్యాయవాదులు రంజిత్ గౌడ్, లక్షిదేవి, కొంగర నరహరి, రామ్ ప్రసాద్, కె.విజయ్ కుమార్, పర్వత సతీష్, చింతలగారి వెంకటస్వామి, బత్తుల రాంనర్సయ్య, ఎర్రమల్ల శ్రీను, బుచ్చిబాబు, బాలస్వామి, సాయిరాం, భిక్షపతి, శ్రీహరి, అజయ్ పటేల్, చాపర్తి కుమార్ గాడ్గే తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఉత్తమ స్టడీ సెంటర్‌గా.. మౌలానా వర్సిటీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్న మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ డిస్టెన్స్ స్టడీ సెంటర్ కు జాతీయ స్థాయిలో ఉత్తమ స్టడీ సెంటర్ గా గుర్తింపు లభించింది. ఈ మేరకు శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మౌలానా ఉర్దూ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ కు సర్టిఫికెట్ అందజేసినట్లు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.జ్యోతి ప్రకటించారు. వరంగల్ స్టడీ సెంటర్లలో డిగ్రీ, పీజీ కోర్సులను కూడా నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీలో 200 మంది, పీజీ కోర్సుల్లో 100 మంది విద్యార్థులున్నారని వెల్లడించారు. జాతీయ స్థాయిలో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్టడీ సెంటర్ కు ఉత్తమ స్టడీ సెంటర్ అవార్డు రావడం సంతోషకరమైన విషయమన్నారు. విద్యా బోధనలో ఎప్పటికప్పుడు నూతన ఒరవడులను సృష్టిస్తూ యూనివర్సిటీ క్యాలెండర్ ప్రకారం తరగతుల నిర్వహణ, పరీక్షల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మౌలానా అజాద్ ఉర్దూ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ పరహపాతిమాను ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పుల్లా రమేష్, స్టడీ సెంటర్ అధ్యాపకుడు హలీం కురిషి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. మహిళల అభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమన్నారు. మహిళలు ఓర్పు, సహనంతో కుటుంబాల అభివృద్ధికి ఆలంబనగా నిలుస్తున్నారన్నారు. మహిళలు ఎక్కడ పూజించబడతారో అక్కడ సకల దేవతలు కొలువై ఉంటారని, స్త్రీ లేనిదే మానవ మనుగడ లేదని ఆయన అన్నారు. అనంతరం వివిధ రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న మహిళలను శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సీపీఓ సామ్యూల్, సీడీపీఓ అవంతిక, అంగన్ వాడి టీచర్లు పాల్గొన్నారు.



# ఓటు వైశిష్ట్యం..

దేశాన్ని సుసంపన్నం చేసే నాయకత్వాన్ని
బలపరుద్దాం!
సుదూర లక్ష్యాన్వేషణ ఎజెండాతో వచ్చే
సమర్థ నాయకత్వాన్ని ఎన్నుకొందాం!
తాత్కాలిక సంక్షేమ పథకాల ఆకర్షణలో
పడి
విలువైన ఓటును జారవిడుచుకోవద్దు!
దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింప జేసే
దేశ ఖ్యాతికి పునరంకితమయ్యే
సుదృఢ పరిపాలకులనే సమర్థిద్దాం!
శాంతి సామరస్యతలకు భంగం వాటిల్లని
దేశ సౌభాగ్యదాతలకు చేయూతనిద్దాం!
పేద బడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేసే
సాంస్కృతిక నేపథ్యాన్ని పరిరక్షించే,
శాస్త్రీయ కోణాన్ని ఆవిష్కరింపజేసే
రైతు రాజ్యాన్ని సుస్థిరపరిచే
యువత కలలను సాకారం చేసే
మహిళాభ్యున్నతికి పథకాలు రచించే
శ్రామిక లోకానికి చేయూతనిచ్చే
విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిచ్చే
భారత పౌరుల ఆకాంక్షల నెరవేర్చే
సుస్థిర ప్రభుత్వానికి బాటలు వేస్తూ..
ఓటు ఆయుధాన్ని ప్రయోగిద్దాం!
ప్రజాస్వామ్య పరిరక్షకుల మవుదాం!
రాజ్యాంగ విలువలను కాపాడుకుందాం!
స్వాతంత్ర్యఫలాలను అందుకొందాం!
భవ్య భారతాన్ని నిర్మిద్దాం!!



**పరాంకుశం రఘు నారాయణ**
గ్రామం : తొర్రూరు
మహబూబాబాద్ జిల్లా
చరవాణి సంఖ్య: 9949749987

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com